

# మురళి ఊదే పాపడు

దాదా హయాత్

ఆవులు ఆనందంగా గడ్డి మేస్తున్నాయి.
కొంత దూరంగా ఒక పిల్లవాడు చెట్టుకొమ్మ మీద కూర్చొని పిల్లనగ్రోవి ఊదుతున్నాడు.
ఆవులు పాట వింటూ తలలూపుతున్నాయి.

గాలిలో తేలిపోతున్న పిట్టలు ఎగరడం ఆపి ఆ చెట్టు కొమ్మల మీద వాలుతున్నాయి. ఆకాశంలో ప్రయాణం చేస్తున్న మేఘాలు పాట కోసం దిగొచ్చి సన్నని చినుకులు రాలుస్తున్నాయి.

ఒక అమ్మాయి బండెక్కి వెళ్తున్నదల్లా ఆగి పరుగెత్తుకుంటూ వచ్చింది.

పిల్లవాడు మురళి ఊదడం ఆపి ఆమె వంక చూశాడు.

''పాపడా పాపడా, నువ్వెవరివి?'' అడిగిందా అమ్మాయి మెరిపించే కళ్లతో.

''నేనీ ఆవులు కాసే పిల్లవాణ్ణి,'' కొమ్మ మీంచి చెప్పాడు మురళి ఊదే పిల్లవాడు.

''పాపడా, పాపడా... ఆవుల పాపడా, పాట ఎందుకు ఆపావు?'' అందా అమ్మాయి.

''సూర్యుడు పడమట కుంగిపోతున్నాడు. ఆవులు మళ్లించే వేళయింది,'' అన్నాడు మురళి ఊదే పిల్లవాడు.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా నా కోసం ఆ పాట మళ్లీ పాడవూ?'' అందా అమ్మాయి.

ఆవుల పాపడు మళ్లీ మురళి పాట పాడాడు. ఆ అమ్మాయి పాట విన్న ఆనందంలో మైమరిచి ఆడింది.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా రేపు మళ్లీ వచ్చి పాట పాడతావా?'' అడిగిందా అమ్మాయి.

రోజూ ఇక్కడికొస్తాను. ఈ చెట్లలో, పుట్టల్లో ఆడతాను. గడ్డి బయళ్లలో ఆవుల్ని మేపుతాను. ఈ కొమ్మనెక్కి మురళిపాట పాడతాను,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, అయితే రేపు మళ్లీ వస్తాను,'' అందా అమ్మాయి.

మర్నాడు ఆ పిల్లవాడు అదే చెట్టుకొమ్మ మీద మురళిపాట పాడు తున్నాడు.

బండి మీద ఆ అమ్మాయి మళ్లీ వచ్చింది.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా కొత్త పాట పాడు,'' అంది.

మురళి ఊదే పాపడు ఆమె కోసం కొత్త పాట పాడాడు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి చెట్లలో, పుట్టల్లో ఆడుకున్నారు. పచ్చిక బయళ్లలో పరుగులు తీశారు.

సాయంత్రం మురళి ఊదే పాపడు చెట్టుకొమ్మ నెక్కి మళ్లీ మురళిపాట పాడాడు.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా నేను రోజూ వస్తాను. రోజూ నాకోసం నువ్వో కొత్త పాట పాడు,'' అందా అమ్మాయి.

ఆరోజు నుంచీ ఆ అమ్మాయి మురళిపాట కోసం ప్రతిరోజు అక్కడికొస్తోంది. మురళి ఊదే పాపడు రోజూ ఆమెకో కొత్త పాట వినిపిస్తాడు. ఇద్దరూ చెట్లల్లో, పుట్టల్లో, పచ్చికబయళ్లలో మళ్లీ మళ్లీ ఆడ్తారు. మళ్లీ మళ్లీ మురళి ఊదే పాపడు ఆ అమ్మాయికి పాట పాడి వినిపిస్తాడు.

వసంతం వెళ్లిపోయింది. ఎండాకాలం వచ్చింది. ఎండాకాలం వెళ్లిపోయింది.

వానాకాలం వచ్చింది. వానలు మాత్రం రాలేదు.

ఆవులు ఆకాశం వంక చూశాయి. వానలు మాత్రం రాలేదు.

పచ్చికబయళ్లు వట్టిపోయాయి. వానలు మాత్రం రాలేదు.

పిట్టలు దాహంతో అల్లాడిపోయాయి. వానలు మాత్రం రాలేదు.

ఒకరోజు అమ్మాయి ఎప్పట్లాగే బండి మీద వెళ్లింది.

మురళి ఊదే పాపడు గమ్మున కూర్చున్నాడు. అతని చేతుల్లో మురళి జాలిగా చూస్తోంది.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా ఎందుకు ఊరికే కూర్చున్నావు?'' అడిగిందా అమ్మాయి.

''గడ్డిబయళ్లు వట్టిపోయాయి. ఆవుల డొక్కలు ఎండిపోయాయి. నేనింక పాడలేను,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! ఎందుకు గడ్డి బయళ్లు వట్టిపోయాయి? ఎందుకు ఆవుల డొక్కలు ఎండిపోయాయి?'' అడిగిందా అమ్మాయి.

''వానాకాలం వచ్చింది. వానలు మాత్రం రాలేదు. నేల నెర్రలు చీలింది. వానలు మాత్రం రాలేదు. గడ్డి బయళ్లు వట్టిపోయాయి. ఆవుల డొక్కలు ఎండి పోయాయి. నా చేతి మురళి మూగవోయింది. నా పాట కూడా ఆగిపోయింది,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, గడ్డి బయళ్లు వట్టిపోతే పోయాయి. ఆవుల డొక్కలు ఎండిపోతే పోయాయి. నువ్వు మాత్రం పాట ఆపకు,'' అందా అమ్మాయి.

''ఆవుల డొక్కలు ఎండిపోతే నా మురళి కూడా మూగవోయింది. నా పాట కూడా ఆగిపోయింది. నువ్వు మళ్లీ రావద్దు. పాట పాడమని నన్నడగొద్దు,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

ఆ అమ్మాయి చిన్నిగుండె బాధతో నిండి పోయింది. ''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నేల ఎందుకు చీలింది? వాన ఎందుకు రాలేదు?'' అని అడిగింది.

''చెట్లూ పుట్టలూ నరికేస్తున్నారు. మబ్బుకు అలక తెప్పిస్తున్నారు. వానలు అందుకు రామంటున్నాయి. నేలలు అందుకు చీలిపోతున్నాయి,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, చెట్లూ పుట్టలూ ఎందుకు నరికేస్తున్నారు? మబ్బుకు కోపం ఎందుకు తెప్పిస్తున్నారు?'' అని అడిగిందా అమ్మాయి.

''అదేమో నాకేం తెలుసు? అది మీవాళ్లనే అడుగు. చెట్లూ పుట్టలూ వాళ్లే నరుకుతున్నారు. మబ్బుకు కోపం తెప్పిస్తున్నారు,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''అయితే మరి వాళ్లేనా పాపడా. పాపడా మరేం దిగులుపడకు. వాళ్లంతా నావాళ్లే. మా నాన్నగారు ఊళ్లేలే నాన్నగారు. ఆయనతో చెప్పి చెట్లూ పుట్టలూ నరకడం ఆపిస్తాను. నువ్వేం దిగులుపడకేం,'' అని చెప్పి ఆ అమ్మాయి తన ఊళ్లేలే నాన్నగారి దగ్గరకు వెళ్లింది.

''నాన్నగారూ నాన్నగారూ, ఊళ్లేలే నాన్నగారూ! చెట్లూ పుట్టలూ ఎందుకు నరికిస్తున్నారు? మబ్బుకు కోపం ఎందుకు తెప్పిస్తున్నారు?'' అని అడిగింది.

''ఎందుకు చెట్లు? ఎందుకు పుట్టలు? భవనాలు కడితే బోలెడు డబ్బొస్తుంది. చిట్టితల్లికి వంటి నిండా బంగారం వస్తుంది,'' అన్నారు ఊళ్లేలే నాన్నగారు.

''నాన్నగారూ నాన్నగారూ, ఊళ్లేలే నాన్నగారూ! నాకు భవనాలొద్దు. నాకు బంగారం వద్దు. చెట్లు నరకడం ఆపించండి. మళ్లీ వానలు కురిపించండి,'' అందా అమ్మాయి.

''ఇలాంటివి చిన్నపిల్లలకు తెలుస్తాయా? నాలుగు చెట్లు నరకనందుకే మబ్బులు మెచ్చి కురుస్తాయా? మబ్బుల విషయం ఆలోచించకు. వెళ్లి ఆడుకో, ప్రశ్నలు వేయకు,'' అన్నారు ఊళ్లేలే నాన్నగారు.

ఆ అమ్మాయి వెళ్లి ఆడలేదు. విచారపడడం మానలేదు. మర్నాడు ఆమె వెళ్లేసరికి మురళి ఊదే పాపడు ఎక్కడికో బయల్దేరుతున్నాడు.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! ఎక్కడికి నువ్వు వెళుతున్నావు?'' అనడిగిందా అమ్మాయి.

''నే నెక్కి కూర్చునే చెట్టు కూడా నిన్నటితో మీవాళ్లు నరికి పార వేశారు. రాతిమిద్దెలు లేవబోయే ఈచోట నాకూ, నా మురళికి ఇంకేం పని లేదు. అది చెప్పడానికే ఉన్నాను. ఇంక నేను వెళతాను,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నువ్వె క్కడికీ వెళ్లకు. నువ్వు మరి వెళ్లిపోతే నాతో కలిసి ఆడేదెవరు? మురళిపాట పాడేదెవరు?'' అందా అమ్మాయి.

''చెట్లలో పుట్టల్లో పచ్చిక బయళ్లలో గాలి మీద సాగుతూ తేలిపోయే నా పాట రాతిగోడల కేసి తల బాదుకోలేదు. నువ్వు నన్నాపకు,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నువ్వు మళ్లీ ఎప్పుడొస్తావు?'' కన్నీళ్లతో అడిగిందా అమ్మాయి.

''చెట్లూచేమలతో ఈ నేలంతా మురిసిపోవాలి. ఆకాశంలో సాగిపోయే మబ్బులు కిందికి దిగి రావాలి. వానజల్లుతో ఈ నేల తడిసి పునీతం కావాలి. అప్పుడే

మళ్లీ వస్తాను. నా పాట నీకు వినిపిస్తాను,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, నన్ను మాత్రం మరిచిపోకు,'' చెయ్యి ఊపుతూ అందా అమ్మాయి.

నేల మీద చెట్లూ పుట్టలూ అన్నీ తుడిచిపెట్టుకు పోయాయి. ఏవైపు చూసినా రాతిగోడలు వెలిశాయి. ఊళ్లేలే నాన్నగారికి డబ్బులు చాలా వచ్చాయి. అమ్మాయికి వంటి నిండా బంగారు నగలు తెచ్చాయి.

అమ్మాయి మాత్రం వాటిని తొడగలేదు. దూరంగా నగలు విసిరేసింది. రోజూ ఆమె ఇంటి మేడమీద పడుకుని ఆకాశం వంక విప్పారిన కళ్లతో చూస్తుంది. ఒక్క మబ్బుతునకైనా లేదు. ఒక్క వానచినుకైనా లేదు.

వానాకాలం వెళ్లింది. మళ్లీ వానాకాలం వచ్చింది. ఆ వానాకాలం వెళ్లింది. ఇంకో వానాకాలం వచ్చింది. వానలు మాత్రం రాలేదు. మురళి ఊదే పాపడి జాడలేదు.

ఒకరోజు ఊళ్లేలే నాన్నగారు కూతురికి ఇష్టమని ఒక పిల్లనగ్రోవి పట్టుకొచ్చారు.

అది చూస్తూనే ఆ అమ్మాయి, ''వచ్చాడా?'' అంటూ ఆత్రంగా గుమ్మం వైపు పరుగెత్తింది.

ఊళ్లేలే నాన్నగారు ఆమెను పట్టుకున్నారు.

''ఎక్కడికలా పరిగెడతావ్? పరిగెడితే పడిపోతావ్. ఇదిగో పిల్లనగ్రోవి. ఇది చూసైనా దిగులు మానుకో. పారేసిన నగలు తీసి వంటి నిండా పెట్టుకో,'' అన్నారు.

ఆ అమ్మాయి ఆరోజు ఆ పిల్లనగ్రోవిని దగ్గర పెట్టుకు పడుకుంది. మబ్బుతునక కోసం ఆకాశం కేసి చూసింది. చిత్రంగా ఆకాశం ఆమె కళ్ల ముందు ఒక్కసారిగా తెరుచుకుంది. ఎక్కడో తారల దారుల వెంట ఆకా శానికెంతో అవతల ఒక సుందర నందనవనం ఆమె కళ్లకు కనిపించింది.

ఆ నందనవనం నిండా ఎన్నో చెట్లు, ఎన్నో పూలు, ఎన్నో పక్షులు. మురళి ఊదే పాపడు ఒక చెట్టు కొమ్మ మీద కూర్చుని మురళి ఊదు తున్నాడు. చుట్టూ కొన్ని వందల వేల ఆవులు పాటకు తలలూపుతూ పచ్చిక మేస్తున్నాయి.

అది చూస్తూనే, ''పాపడా, మురళి ఊదే పాపడా,'' అని అమ్మాయి కేక వేసింది.

మురళి ఊదే పాపడు పాట ఆపి అమ్మాయి వంక చూశాడు. అతని పెదవుల మీద ఎంతో అందమైన చిరునవ్వు లాస్యం చేస్తోంది. దివ్య తేజస్సుతో అతను వెలిగిపోతున్నాడు. ''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా నువ్వక్కడ ఆకాశంలో ఏం చేస్తున్నావు?'' అని అడిగిందా అమ్మాయి.

''ఇది ఆకాశం కాదు. ఆకాశం కంటే ఇంకా ఎంతో దూరం. ఇక్కడ రాతిమేడలు లేవు. ఎటుచూసినా చెట్లు. ఎటుచూసినా పచ్చికబయళ్లు. ఇక్కడ మబ్బులు అలగవు. రోజూ అమృతం కురుస్తూ ఉంటుంది. ఇదొక అద్భుతమైన చోటు,'' అన్నాడు మురళి ఊదే పాపడు.

''పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! అక్కడికి నువ్వెలా వెళ్లావు?'' అని అడిగిందా అమ్మాయి.

''రాతిగుండెల మనుషుల మధ్య ఎన్నో దేశాలు తిరిగాను. ఎటుచూసినా రాతిగోడలు లేవడం చూశాను. ఎవరూ కూల్చలేని గొప్పగొప్ప రాతిగోడలు. మనుషులకూ మనుషులకూ మధ్య రాతిగోడలు. కొట్టుకు చావడంలో కొందరు, డబ్బు సంపాదించడంలో కొందరు మునిగి తేలుతున్నారు. ప్రకృతిని ప్రేమించలేని వాళ్ల మధ్య నాకూ, నా మురళికీ చోటు లేదు. అందుకే ఇక్కడికి వచ్చేశాను. ఇదే నా చోటు. ఇంకెప్పుడూ నేను మళ్లీ అక్కడికి రాను. కలకాలం ఇక్కడే మురళిపాట పాడుకుంటాను,'' అంటూ మురళి ఊదే పాపడు మళ్లీ పిల్లనగ్రోవి అందుకున్నాడు.

ఆ మధురమైన సంగీతానికి మళ్లీ ఆవులు తలలూపనారంభించాయి. మళ్లీ పిట్టలు గంతులేస్తూ ఎగరనారంభించాయి. మబ్బులు అమృతం కురిపిస్తున్నాయి.

''పాపడా, నేనూ అక్కడికి వస్తాను,'' కేకేసిందా అమ్మాయి. సరిగ్గా అదే సమయంలో ఆకాశం మళ్లీ మూసుకుపోయింది. పాట మళ్లీ ఆగిపోయింది.

''పాపడా,'' అని అరుస్తూ ఆ అమ్మాయి చేతులు చాచి ముందుకు పరుగెత్తింది.

ఆ మర్నాడు ఊళ్లేలే నాన్నగారు వచ్చి చూసేసరికి ఆ అమ్మాయి రాతిగోడల మధ్య నిర్జీవంగా పడుంది. ఆమె విసిరేసిన బంగారు నగలు వెలవెలబోయి చూస్తున్నాయి.

ఊళ్లేలే నాన్నగారు నేలమీద కూలబడ్డారు. ఆ అమ్మాయిని సమాధి చేసిన చోటనే చిత్రంగా ఒక అందమైన చెట్టు మొలిచింది. వానకారు అవసరం లేని ఆ చెట్టు, అమృతంతో పెరిగే చెట్టు.

భూమండలం మీద మిగిలిన ఒకే ఒక చెట్టు.

ఆ చెట్టు నీడలో విశ్రమించడానికి ఎక్కడెక్కడి నుంచో జనం వస్తుంటారు. అలా విశ్రమించినవారికి రహస్యంగా ఒక పిల్లనగ్రోవి పాట వినిపిస్తుందని చెబుతారు.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 26 అక్టోబర్ 1995*